


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

అనంతగిరి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన అన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టులో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ న్యాయమూర్తి డీబీ సీతల్, జూనియర్ న్యాయమూర్తి శ్రుతిదూత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో ఆరుగురు అక్కాచెల్లెల్లు



కొడంగల్: మండలంలోని రావులపల్లికి చెందిన లక్ష్మి, అంజయ్య గౌడ్ దంపతులకు ఆరుగురు కూతుళ్లు. మొదటి, రెండో కూతుళ్లు జయమాల, అనురాధ అంగడి రాయిచూర్ పీహెచ్‌పీలో ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్నారు. మూడో కూతురు అరుణజ్యోతి మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రిలో జీఎన్ఎంగా సేవలందిస్తున్నారు. నాలుగో కూతురు ఉమలత హైదరాబాద్‌లో స్టాఫ్ నర్సుగా పని చేస్తోంది. ఐదో కూతురు రాధిక నగరంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తోంది. ఆరో కూతురు శిరీషా హైదరాబాద్‌లో జీఎన్ఎం స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తోంది. వీరిలో నలుగురికి వివాహాలు జరిగాయి.


ఎంపీడీఓ శ్రీదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నింగి.. నేల.. ఆమె

కార్యేషు దాసి, కరనేషు మంత్రి, భోజ్యేషు మాత, షయనేషు రంభ ఇలా సృష్టిలో ఎన్నో పాత్రలకు మూలం మహిళ.. తల్లిగా.. ఇల్లాలిగా.. కోడలిగా.. కూతురిగా ఇంటిని చక్కదిద్దేదే స్త్రీ మూర్తి.. అందుకే ఇంటికి దీపం ఇల్లాలు అన్నారు. ఆమెకూ ఓ రోజంటూ ఉంది అదే.. ఉమెన్స్ డే. మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనాలు.

● ఆమెకు సన్మానం

బొంరాస్‌పేట మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ రాంరెడ్డి, టీపీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఎంపీడీఓ శ్రీదేవి, మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, శ్రీప్రియ, శశివర్ణ, అంజు, అనిత, క్లస్టర్ హెచ్ఎంలు శ్రీహరి రెడ్డి, హరిలాల పాల్గొన్నారు.

– బొంరాస్‌పేట

ఉపాధ్యాయ వృత్తిలో..


పాఠాలు బోధిస్తున్న మంజూభాషిణి

యాలాల: నాలుగు దశాబ్దాలుగా ఉపాధ్యాయ వృత్తిలో మంజూభాషిణి సేవలందిస్తున్నారు. యాలాల బాలుర ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం టీచర్‌గా విధులు నిర్వహిన్నారు. అటు కుటుంబ బాధ్యతలు.. ఇటు విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుతోంది. 1983 బ్యాచ్‌కు చెందిన మంజూ బంట్వారం మండలం తొర్మామిడి పాఠశాల నుంచి తన వృత్తిని ప్రారంభించారు. రవాణా సౌకర్యం సరిగ్గా లేని సమయంలో కూడా సకాలంలో పాఠశాలకు వెళ్లి తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు పాఠశాలల్లో పని చేశారు. ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడంలో ఆమె పాత్ర చాలా ఉంది.

వారి స్ఫూర్తితో...


వసంత, ఎస్సై

బొంరాస్‌పేట: దుద్యాల మండలం గౌరారం గ్రామానికి చెందిన రామయ్య, కిష్టమ్మ దంపతులకు ఐదుగురు సంతానం. అందరూ ప్రభుత్వ ఉద్యోగులే.. చివరి సంతానం వసంత. అన్నలు, అక్క ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో వారిని స్ఫూర్తిగా తీసుకొని తానూ ఎస్ఐ పోస్టు సాధించింది. ప్రస్తుతం నారాయణపేట జిల్లా దామరగిద్ద గ్రామంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాన్న ప్రేరణ, అమ్మ పట్టుదలను చిన్నప్పుడే నేర్చుకున్నా.. బీటెక్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ కావాలనుకున్నా. సోదరులు, సోదరి స్ఫూర్తితో 2020 బ్యాచ్‌లో ఎస్సై ఉద్యోగం సాధించా. ప్రతి రంగంలో మహిళలు రాణించాలి. ఒకప్పుడు పోలీసు ఉద్యోగం పురుషులకు మాత్రమే అన్నట్లు ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. పురుషుల తోపాటు మహిళలు పోలీసు శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు.


యునానీ వైద్యురాలు సాజన్య


మెడికల్ ఆఫీసర్ అనూష



ఎస్ఐగా శిక్షణ పొందుతున్న తేజశ్రీ

❖ ఆ ముగ్గురు.. గెలిచారు.. నిలిచారు

శంకర్‌పల్లి: ముగ్గురు ఆడ పిల్లలున్నా ఆ ఉపాధ్యాయుడు అధైర్య పడకుండా కుమారుడితో సమానంగా వారిని ఉన్నత చదువులు చదివించారు.. ప్రయోజకులను చేశారు.. తల్లిదండ్రుల కష్టాన్ని చూస్తూ పెరిగిన ఆ ముగ్గురూ ఉన్నత స్థానాల్లో స్థిర పడాలని సంకల్పించుకున్నారు.. వారి ఆశయాలకు అనుగుణంగా జీవితంలో ఎదిగారు.. వికారాబాద్ జిల్లా, నవాబ్‌పేట్ మండలం చిట్టిగిద్ద గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సంజీవరావు, పుష్పరాణి దంపతులకు నలుగురు సంతానం. శంకర్‌పల్లి టీచర్స్ కాలనీలో స్థిర పడ్డారు. పెద్ద కుమార్తె సౌజన్య యునానీ వైద్యురాలిగా శంకర్‌పల్లిలో సొంత ఆస్పత్రి పెట్టుకొని వైద్య సేవలు అందిస్తోంది. రెండో కుమార్తె అనూష మండలంలోని మహాలింగపురంలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. మూడో కుమార్తె తేజశ్రీ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇటీవల ఎస్ఐ పరీక్షల్లో ఎంపికైంది. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. ఇద్దరు కుమార్తెలకు వివాహం అయింది. వారు కూడా శంకర్‌పల్లిలోనే స్థిర పడ్డారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని తల్లిదండ్రుల కలను సాకారం చేశారు ఆ కూతుళ్లు.

వివక్ష తగ్గింది


విజయలక్ష్మి, ఎంపీపీ, ధారూరు

ధారూరు: ప్రస్తుత సమాజంలో మహిళల పట్ల వివక్ష, పురుషాధిక్యం తగ్గిందని జైదుపల్లి ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళలు దూసుకెళుతున్నారు. పురుషులతో సమానంగా అవకాశాలు పొందుతున్నారు. కొన్ని సందర్భాలలో మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రతి మనిషిలో మార్పు రావాలి. మహిళలను చూసే కోణంలో, మాట్లాడే విధానంలో, వ్యవహార శైలిలో మార్పు రావాలి. అప్పుడే స్త్రీలకు సరైన గౌరవం దక్కుతుంది. ఎంపీపీగా లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ధారూరు మండల అభివృద్ధికి కృషి చేస్తా.

శక్తి వంచనకు గురవుతోంది


విమల, ఎస్ఐ

తాండూరు రూరల్: నేటి కంప్యూటర్ యుగంలోనూ స్త్రీ శక్తి వంచనకు గురవుతోందని కరన్‌కోట్ ఎస్ఐ –2 విమల అన్నారు. మహిళా దినోత్సవ పండుగ మన దేశంలోని మహిళలకు కాస్తంత చేదు గుళికలనే మిగిల్చిందనే చెప్పవచ్చని అన్నారు. సభ్య సమాజ చైతన్యాన్ని, సామాజిక బాధ్యతలను సవాలు చేస్తూ సాగిపోతున్న స్త్రీలపై దారుణ అఘాయిత్యాలకు అంతులేకుండా పోతోంది. వీటి నియంత్రణకు కఠిన చట్టాలు తెచ్చినా నిరీర్యమైపోతున్నాయి. ఇందుకు కారణాలను అన్వేషించాలి. స్త్రీలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, అవరోధాలను అధిగమిస్తూ ముందుకెళ్లాలని సూచించారు.


తల్లిదండ్రులతో నీలిమా, శివాని, సుమని

సరస్వతీ పుత్రికలు..

పరిగి: పట్టణంలో నివాసం ఉండే హన్మంతు ముదిరాజ్, సుశీల దంపతులకు ముగ్గురు కూతుళ్లు. హన్మంతు ఆర్టీసీ ఉద్యోగి.. కూతుళ్లే కుమారులుగా చదివించాడు.. అమ్మాయిలు కూడా ఎక్కడా తగ్గలేదు.. తండ్రి ఆశయం దిశగా అడుగులు వేశారు.. పెద్ద కూతురు నీలిమా ఎంఎస్ చదివేందుకు ఆస్ట్రేలియాకు వెళ్లింది.. రెండో కూతురు శివాని ఎంబీబీఎస్ పూర్తి చేసి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాక్టీస్ చేస్తోంది. మూడో కూతురు సుమని ఎంఎస్ చదివేందుకు యూఎస్ వెళ్లింది. వీరు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరుస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

❖ అమ్మే ఆదర్శం


మాట్లాడుతున్న పావని

అనంతగిరి: నేను ఈ స్థాయిలో నిలబడి మాట్లాడుతున్నానంటే అందుకు కారణం అమ్మేనని దుద్యాల పావని అన్నారు. వికారాబాద్ పట్టణ పరిధిలోని రామయ్యగూడకు చెందిన పావని ఇటీవల నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. ఆమె మాట్లాడుతూ.. కష్టపడితే ఏదైనా సాధ్యమే అన్నారు. నా విజయంలో అమ్మ, అన్న ప్రోత్సాహం ఉందన్నారు. నాన్న చనిపోయాక అమ్మ మా చదువుకు ఎక్కడా లోటు లేకుండా చూసుకుంది. గురువారం రామయ్యగూడ వాసులు పావనిని ఘనంగా సత్కరించారు.

❖ బాధను దిగమింగి..


తల్లి సక్కుబాయితో కూతుళ్లు మంజుల, జ్యోతి

బొంరాస్‌పేట: మండల కేంద్రానికి చెందిన సక్కుబాయి భర్త 22సంవత్సరాల క్రితం చనిపోయాడు.. అప్పటికి ఇద్దరు చిన్న పిల్లలు. దుఃఖాన్ని దిగమింగి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగింది. కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కూతుళ్లను చదివించింది. పెద్ద కూతురు మంజుల ఎమ్మెస్సీ, బీఈడీ చేసి పర్గి పట్టణంలో ఆంగ్ల మీడియం పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ ఐఐటీ (గణితం) విద్యార్థులకు కోచింగ్ ఇస్తోంది. రెండో కూతురు జ్యోతి బీఎస్సీ పూర్తి చేసి రెవెన్యూ శాఖలో ఉద్యోగం సాధించింది.

నా సంకల్పానికి అమ్మే స్ఫూర్తి



బొంరాస్‌పేట: నాలుగేళ్ల ప్రాయంలో తండ్రిని కోల్పోయా.. నాన్న గురించి ఏ సందర్భం వచ్చినా ఏడుపు ఆగదు.. మా అమ్మ నైతిక విలువలతో నన్ను పెంచిందని శశివర్ణ తెలిపింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి పట్టణానికి జంగం శరణయ్య, పార్వతమ్మలకు ఏకైక కూతురు శశివర్ణ. నాలుగేళ్ల వయసులో క్యాన్సర్‌తో నాన్న చనిపోయాడు. టీటీసీ పూర్తి చేసి ఉపాధ్యాయ పోస్టు సాధించింది. ప్రస్తుతం బొంరాస్‌పేట మండలం ఏనెమీది తండాలో టీచర్‌గా పని చేస్తోంది. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. స్త్రీ లేకపోతే సృష్టే లేదన్నారు. అమ్మ ప్రేరణతో పిల్లలకు చదువుతోపాటు ఆరోగ్యం, ఆధ్యాత్మికం తదితర అంశాలు నేర్పుతున్నా. పిల్లన్ని ఉన్నతంగా చదివించాలన్న నా సంకల్పానికి అమ్మే స్ఫూర్తి.

గ్యారంటీలకు ఆకర్శితులై చేరికలు


కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. గురువారం జెడ్పీటీసీ మాజీ సభ్యులు కంజర్ల భాస్కర్, చంద్రలింగంగౌడ్, మాజీ ఎంపీపీ మోహన్‌గౌడ్ ఇతర పార్టీల నాయకులతో కలిసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ ఆధ్వర్యంలో సునీతారెడ్డి సమక్షంలో హస్తం గూటి కి చేరారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు ఆకర్శితులై వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మత్స్యకార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్, ఫిషర్‌మెన్ మండల అధ్యక్షుడు భిక్షపతి, మల్లేశ్, నాయకులు అనంత రెడ్డి, కంజర్ల శేఖర్, రమేశ్‌ముదిరాజ్, దాస్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది డీబార్

కుల్కచర్ల: మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న తొమ్మిది మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు ఇంటర్ బోర్డు జిల్లా నోడల్ ఆఫీసర్ ఎన్.శంకర్ తెలిపారు. కుల్కచర్లలోని పలు పరీక్ష సెంటర్లను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక వివేకానంద కళాశాల, శ్రీరామలింగేశ్వర కాలేజీలో ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్ సెకండ్ పేపర్ రాస్తున్న పలువురిని తనిఖీ చేశారు. వివేకానంద కళాశాలలో ఐదుగురు, శ్రీరామలింగేశ్వర కాలేజీలో నలుగురు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి తొమ్మిది మందిని డీబార్ చేశామని తెలిపారు.

క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి
డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పరిగి: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎస్పీ కరుణసాగర్ రెడ్డి కోరారు. గురువారం పట్టణ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి కొడంగల్ చౌరస్తా వరకు స్పెషల్ ఫోర్స్‌తో కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో అనుమానితులు తిరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వీధుల్లో ఎవరైనా కొత్తవారు అనుమానితులుగా ఉంటే విచారిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్
తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ శివారులో గురువారం పేకాటరాయుళ్లను కరన్‌కోట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి వివరాల మేరకు.. తాండూరుకు చెందిన ఆరుగురు వ్యక్తులు గౌతపూర్ శివారులోని వేపచెట్టుకింద పేకాట ఆడుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు పేకాటస్థావరంపై దాడి చేశారు. వారివద్ద నుంచి రూ.8 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లి మందలించిందని..
అనంతగిరి: వికారాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం విషాదం చోటుచేసుకుంది. పాఠశాలకు వెళ్లమని తల్లి మందలించడంతో కుమార్తె(14) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపల్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు వివరాల మేరకు.. మున్సిపల్ పరిధిలో ఓ వార్డుకు చెందిన విద్యార్థిని అదే కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ఉదయం పాఠశాలకు వెళ్లమని తల్లి మందలించడంతో ఇంట్లోకి వెళ్లి బాలిక ఆత్మహత్య చేసుకుంది. అయితే ఈ ఘటన విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


తిరుపతి (ఫైల్)

దోమ: మద్యం మత్తులో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని దిర్సం పల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్పటి తిరుపతి(27)కి ఆరేళ్ల క్రితం వివాహం అయింది. అతను తరచుగా దొంగతనాలకు పాల్పడుతున్న ఆరోపణలు ఉండడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన అతను మద్యం మత్తులో పొలానికి పిచికారీ చేసే ద్రావణాన్ని తాగాడు. తల్లి వెంటనే పరిగి ప్రభుత్వ ఆస్పత్రి తీసుకెళ్లింది. పరిశీలించిన వైద్యులు అప్పటికే తిరుపతి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆలయాల శుభ్రత


ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

తాండూరు టౌన్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆలయాల శుభ్రత కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని వినాయక శాఖ తోడ్పాటుతో స్వయం సేవకులు ఆలయాల్లో గురువారం శుభ్రత నిర్వహించారు. సాయిపూర్ శివాలయం, మైసమ్మ ఆలయంతో పాటు పరిసర ఆలయాలను శుభ్రపరిచారు. కృష్ణయ్య, సంగమేశ్వర్‌రెడ్డి, సిద్రామేశ్వర్, శ్రీనివాస్, ఆనంద్, అభిషేక్ పాల్గొన్నారు.

శివరాత్రి.. ఆధ్యాత్మిక సిరిధాత్రి

జిల్లాలో ముస్తాబైన శివాలయాలు

జిల్లాలోని శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగేందుకు సిద్ధమయ్యాయి. శైవ క్షేత్రాలు పండగ శోభను సంతరించుకున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆయా దేవాలయాల్లో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.


తాండూరు రూరల్: రామలింగేశ్వరస్వామి


అనంతగిరి: ముస్తాబైన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం


బషీరాబాద్: నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయం


అనంతగిరి: శివలింగం

అనంతగిరి: శివునాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అంటారు. అలాంటి ఈశ్వరుడికి శివరాత్రి పర్వదినం ఎంతో ప్రత్యేకం. భక్తులు నిష్ఠా రీతితో ఉపవాస దీక్షలు బూని ఆ గంగాధరుణ్ని ఆరాధిస్తారు. జిల్లాలోని వివిధ శివాలయాలు ఆధ్యాత్మిక శోభను విరజిల్లుతున్నాయి. వికారాబాద్ పట్టణానికి 5 కి.మీల దూరంలో ఉన్న శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని జరిగే ప్రత్యేక ఉత్సవాలకు ముస్తాబైయింది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున నిర్వాహకులు అందుకు తగ్గట్టుగానే సిద్ధం చేస్తున్నారు.

ఆలయ చరిత్ర

ప్రాచీన కాలంలో త్రేతాయుగాంతం దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అవతరించిన శ్రీరామ చంద్రుడు రావణాది రాక్షస సంహారం గావించి బ్రహ్మహత్య దోష నివృత్తికై అడుగడుగునా శివలింగాలను స్థాపించినట్లు చరిత్ర చెబుతుంది. ఇందులో భాగంగా శ్రీరాముడు స్థాపించిన శివలింగాలు రామలింగేశ్వరులుగా పిలుస్తున్నారన్నది తెలిసిన విషయమే. పూర్వం శ్రీరామచంద్రునిచే ప్రతిష్ఠించబడి లింగ రూపంలో ఉన్న శివుడు అనంతగిరి అడవుల్లోని బుగ్గ రామలింగేశ్వరుడిగా, సాక్షాత్ శ్రీరామచంద్రునిచే ప్రతిష్ఠించబడిన పుణ్య క్షేత్రం అని ప్రతీతి. భక్తుల కొంగు బంగారంగా వెలిసి భక్తులతో నిత్యం పూజలందుకుంటున్న శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ఈసారి కూడా ఘనంగా జరగనున్నాయి. ఆలయ ఆవరణలో పుష్కరిణి ఉంది. ఇందులో గోముఖం నుంచి నిత్యం నీటి ధార వస్తునే ఉంటుంది.

ప్రత్యేక పూజలు

ఉత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహనంతో ప్రారంభమయ్యాయి. శుక్రవారం శివరాత్రి రోజు ఉదయం 5గంటలకు సుప్రభాతసేవ, 5.30 గంటలకు నుంచి 8గంటల వరకు ప్రత్యేక అభిషేకాలు, అనంతరం స్వామి వారి దివ్య దర్శనం, రాత్రి 10 గంటల నుంచి ప్రత్యేక సామూహిక భజనలు, జాగరణ, 12.30గంటలకు లింగోద్భవ సమయంలో శ్రీ రామలింగేశ్వరునికి మహా రుద్రాభిషేకంతో పాటు తెల్లవారుజాము వరకు భజన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు.

మిగతా ఉత్సవాలు

వికారాబాద్ ప్రాంతంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు మండలంలోని పులుసు మామిడి సమీపంలో వెలిసిన శ్రీ పార్వతీపరమేశ్వరుల గుట్టపై వెలిసిన ఆలయం, పీరంపల్లి బుగ్గ రామేశ్వరాలయం, పట్టణంలోని మల్లికార్జున స్వామి ఆలయం, రామమందిరం, అన్నపూర్ణసహిత విశ్వనాథస్వామి ఆలయం తదితర శివాలయాల్లో సైతం మహా శివరాత్రి కోసం ముస్తాబయ్యాయి.

గోనూర్‌లో ఆధ్యాత్మిక వాతావారణం

తాండూరు రూరల్: మండల పరిధిలోని గోనూర్‌లో ఆధ్యాత్మిక వాతవారణం నెలకొంది. శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టారు. గురువారం ఆలయంలో గణపతి పూజ, నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన, కలశ పూజతో పాటు ప్రత్యేక హోమం నిర్వహించారు. గ్రామానికి చెందిన దత్తాత్రేయ-ప్రభావతి, కట్టెల నర్సింలు, ఇందిర, గోపాల్‌రెడ్డి-రూపమాల, నర్సిరెడ్డి-జగదేవి దంపతులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ

బషీరాబాద్: శివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. మండలంలోని జీవన్గీ గ్రామం బర్కాల్ పూలతోట రామదాసు మఠంలో భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. సాయంత్రం గ్రామంలో వీధుల గుండా రామదాసులు శివుని పల్లకీ సేవా చేశారు.

జీవన్గీలో మహోత్సవం

బషీరాబాద్: మండల పరిధిలోని జీవన్గీ రామలింగేశ్వర ఆలయం, నీళ్లపల్లి ఏకాంబర లింగేశ్వరాలయం, నవాంద్గి సంఘమేశ్వరాలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాలకు దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. వేడుకలకు జిల్లా ప్రజలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక నుంచి వేల మంది భక్తులు తరలి రానుండడంతో తగిన ఏర్పాట్లను ఆలయ కమిటీ పూర్తి చేసింది.

ముందస్తు ఏర్పాట్లు

మర్పల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాలలో శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ఉపవాస దీక్షలు విడిచేందుకు వచ్చే భక్తుల కోసం దేవాదాయ, ఉత్సవ కమిటీ సభ్యులు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు. బూచన్‌పల్లి సంగమేశ్వర ఆలయం, మర్పల్లి సంగమేశ్వర, సిరిపురం పార్వతీపరమేశ్వర ఆలయం, తుమ్మలపల్లి శివాలయంతో పాటు పలు గ్రామాలలో ఉన్న ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

కొండెక్కిన పండ్ల ధరలు

భక్తుల ఉపవాస దీక్షలకు తప్పనిసరిగా పండ్లు కొనుగోలు చేస్తారనే ఉద్దేశంతో పండ్ల వ్యాపారులు ధరలను పెంచారు. వారం క్రితం లేని ధరలు పండగ నేపథ్యంలో రెట్టింపు అయ్యాయి.


బషీరాబాద్: పాదయాత్రగా వెళుతున్న రామదాసు భక్తులు


బషీరాబాద్: నావంద్గి సంగమేశ్వర ఆలయం


మర్పల్లి: పండ్లు కొనుగోలు చేస్తున్న భక్తులు


సమావేశంలో మాట్లాడుతున్న సునీతారెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

చేవెళ్ల ఎంపీ సీటు సీఎంకు గిఫ్ట్ ఇద్దాం

- డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- తాండూరులో కాంగ్రెస్‌పార్టీ విస్తృత స్థాయి సమావేశం

తాండూరు: చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతి ఇద్దామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తాండూరు పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వికారాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగితే అప్పటి ఎమ్మెల్యేలు నోరు మెదపలేదన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న నాలుగు అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలవడం శుభపరిణామమన్నారు. రానున్న రోజుల్లో మన జిల్లాను అభివృద్ధి పథంలో ఉంచుతామన్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావులేదన్నారు. తాండూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పార్టీ కార్యక్రమాలను చూసుకుంటారన్నారు. పార్టీలోని సీనియర్ నాయకులకు తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చాలా మంది నాయకులు రెడీగా ఉన్నారన్నారు. అయితే గ్రామ, మండల, పట్టణ కమిటీల నిర్ణయం మేరకే చేరికలు ఉంటాయని పార్టీ శ్రేణులకు సూచించారు. చేవెళ్ల పార్లమెంట్‌లో సునీతరెడ్డికే టికెట్ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. త్వరలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతున్నాయన్నారు. తొలి ప్రాధాన్యం కాంగ్రెస్ కార్యకర్తలకే ఇస్తామని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నంత కాలం తమ కుటుంబం ఎన్నో అవమానాలను ఎదుర్కొందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్‌లో అవమానాలను భరిస్తూ ఉండలేక తాను కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2009లో చేవెళ్ల పార్లమెంట్ ఏర్పడిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా జైపాల్‌రెడ్డి విజయం సాధించారన్నారు. ఆయన ఆధ్వర్యంలో జిల్లాకు అభివృద్ధిలో ప్రాధాన్యం లభించిందన్నారు. తర్వాత రెండు సార్లు బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీలు గెలిచిన ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు రఘువీరారెడ్డి, థారాసింగ్ జాదవ్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రవీగౌడ్, లక్ష్మారెడ్డి, నాయకులు బుయ్యాని శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాకేష్ మహరాజ్, అబ్దుల్ రవూఫ్, ఉత్తంచంద్, జనార్దన్‌రెడ్డి, హబీబ్‌లాల, ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

అగ్నికి ఆహుతైన నగదు


బాధితురాలు సరోజనమ్మ


ఇంట్లో కాలిపోయిన సామగ్రి

యాలాల: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని విలువైన వస్తువులు, నగదు కాలిబూడిదయ్యాయి. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జుంటుపల్లి గ్రామానికి చెందిన బనాపురం సరోజనమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. ఆమె ఆసరా పింఛను డబ్బులతో కాలం వెళ్లదీస్తుంది. బుధవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బట్టలు, వస్తువులతో పాటు ఇటీవల ఆమె బ్యాంకు నుంచి తీసుకువచ్చిన రైతుబంధు, ఆసరా పింఛను నగదు దాదాపు రూ.50 వేలు సైతం ఆహుతైంది. మంటలు అంటుకున్న సమయంలో సరోజనమ్మ బయట ఉండటంతో ప్రాణనష్టం జరగలేదు. స్థానికులు, గ్రామస్తుల సహాయంతో మంటలను అదుపుచేశారు. వృద్ధాప్యంలో ఒంటరిగా ఉంటున్న తనకు షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వం కోల్పోయానని వాపోయింది. తనను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆమె అభ్యర్థిస్తోంది.

ఇసుక డంపు సీజ్


సీజ్ చేసిన ఇసుక డంపు

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక డంపులు ఏర్పాటు చేసినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని కుల్కచర్ల ఎస్ఐ అన్వేష్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని అనంతసాగర్‌లో ఇసుకను వాగులోంచి తీసి డంపుగా ఏర్పాటు చేశారు. విశ్వసనీయమైన సమాచారంతో రెవెన్యూ అధికారుల సూచనల మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇసుక డంపును గుర్తించి సీజ్ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్


వివరాలు తెలుసుకుంటున్న లింగ్యానాయక్

బషీరాబాద్: ధరణిలో వచ్చిన దరఖాస్తులను త్వరలో పూర్తి చేసి, పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ధరణి స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. మండలంలో భూ సమస్యలపై 212 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు. ఇందులో వందకు పైగా అర్జీలు పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, ఆర్ఐ రాకేష్ ఉన్నారు.

దౌల్తాబాద్ కార్యాలయంలో

దౌల్తాబాద్: ధరణి ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. ధరణి వెబ్‌సైట్‌లోని దరఖాస్తులు, ఫైళ్ల నిర్వహణ తదితర అంశాలపై పరిశీలించారు. ధరణిలో ఉన్న వివిధ రకాల మ్యాడ్యూల్స్‌పై వచ్చిన ఫిర్యాదులను ఆరా తీశారు. భూముల సర్వే, కోర్టు కేసులు తదితర అంశాలను తహసీల్దారు విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు తెలిపారు.

కాయ్ రాజా కాయ్!

తాండూరుకు చెందిన ఓ వ్యక్తి కొన్నాళ్లుగా మట్కాకు బానిసయ్యాడు. లాభాలు రావడంతో ఆటను బాగా ఒంట పట్టించుకున్నాడు. కొద్ది రోజుల్లోనే కథ అడ్డం తిరిగింది. బెట్టింగ్‌లలో తీవ్ర నష్టాలు వచ్చాయి. అయినా వెనక్కి తగ్గకుండా డబ్బులు వస్తాయిలే అనే ఆశతో.. వ్యసనాన్ని వదులుకోలేదు. దీంతో ఆస్తులు ఒక్కొక్కటిగా కరిగిపోయాయి. చివరకు ఊరు వదిలి వలస వెళ్లాడు. మట్కా కారణంగా పంట పొలాలను అమ్ముకున్న వారు ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

- తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లో జడలు విప్పిన మట్కా
- ఈజీ మనీ వేటలో సర్వం కోల్పోతున్న బాధితులు
- రోజువారీ కూలీలు, యువకులే అధికం


ఇటీవల తాండూరులో మట్కా నిర్వాహకులను అరెస్ట్ చేసిన పోలీసులు

తాండూరు: కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే ఆశతో జూదానికి బానిసలైన కొంతమంది సర్వం కోల్పోయి అవస్థలు పడుతున్నారు. ఒకసారి లాభాలు రుచి చూపించి, ఆ తర్వాత సొంతం లూటీ చేసే మాయగాళ్ల వలలో పడి చిక్కులు కొని తెచ్చుకొంటున్నారు. కాలు కదపకుండా రూ.లక్షలు సంపాదిద్దామనే వెర్రితో అన్నీ కోల్పోయి రోడ్డున పడుతున్నారు. నిషేధిత మట్కా, పేకాట వంటి జూద క్రీడలు తాండూరు, కొడంగల్ ప్రాంతాలలో జోరుగా సాగుతున్నాయి. మొబైల్ ఫోన్ల ద్వారా బీటర్లు మట్కా నిర్వహిస్తున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన పోలీసులు మామూలుగా నెలలో ఒకట్రెండు కేసులు నమోదు చేసి లైట్ తీసుకుంటున్నారనే విమర్శలు స్థానికంగా వ్యక్తం అవుతున్నాయి.

సరిహద్దులో స్థావరాలు

తాండూరు పట్టణంలోని బస్వణ్ణకట్ట, రైల్వేస్టేషన్, శివాజీ చౌక్, ఇందిరానగర్, బస్‌స్టేషన్, మల్లప్పమడిగె తదితర ప్రాంతాలలో మట్కా కొనసాగుతున్నట్లు సమాచారం. సెల్‌ఫోన్ ద్వారా చిట్టీల విధానంలో ఈ జూదం నెరపుతున్నారు. నిత్యం కూలీనాలీ చేసుకునే పేదలు, యువత ఈ వ్యసనం బారిన పడుతున్నారు. నియోజవకర్గంలోని తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్ మండలాలతో పాటు కొడంగల్ సరిహద్దు ప్రాంతంలో ఏజెంట్లను ఏర్పరుచుకొని జూదం నిర్వహిస్తున్నారు. ఇందులో నిత్యం రూ.5లక్షల నుంచి 10లక్షల వరకు నగదు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెల రూ.కోట్లలో బెట్టింగ్ కొనసాగుతోంది. జిల్లాలో పలు ప్రాంతాల్లో మట్కా జోరుగా సాగుతోందని నిఘా వర్గాలు గుర్తించాయి. నిర్వాహకుడిని అరెస్టు చేసి చేతులు దులుపుకొన్నారు. కానీ మట్కా బెట్టింగ్‌లను శాశ్వతంగా అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.

మట్కా నిర్వాహకుల అరెస్టు

తాండూరు టౌన్: మట్కా నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వకొడే నగేశ్, ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన షేక్ సిరాజ్‌లు మట్కా నిర్వహిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.1,120 నగదుతో పాటు రెండు ఫోన్లు, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిషేధిత మట్కా, పేకాట ఆడినా, నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం



తాండూరు సబ్ డివిజన్ పరిధిలో మట్కా జూదం అరికట్టేందుకు చర్యలు చేపట్టాం. మట్కా, పేకాటలు నిర్వహిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. జూదం నిర్వహించే స్థావరాలను గుర్తించి వారం రోజుల్లో రెండు కేసులు నమోదు చేశాం.

– బాలకృష్ణరెడ్డి, డీఎస్పీ, తాండూరు

ఓబీసీల అభ్యున్నతికి చేయూత
బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప


మాట్లాడుతున్న వెన్నె ఈశ్వరప్ప

తాండూరు టౌన్: ఓబీసీల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నె ఈశ్వరప్ప అన్నారు. గురువారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఓబీసీల అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటునందిస్తోందన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం కేటాయించిన విశ్వకర్మ యోజన పథకం అమలు, విధి విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, కృష్ణముదిరాజ్, శ్రీహరి, లలిత, సుదర్శన్‌గౌడ్, సాహుశ్రీలత, వెంకట్, నరేష్ మహరాజ్, శాంత్‌కుమార్, భద్రేశ్వర్ పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు
ఇసుక రవాణాకు పాటించని సమయపాలన

యాలాల: ఇసుక తరలింపునకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకేనని పర్మిట్‌లో పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అది అమలు కావడం లేదనే ఆరోపణలున్నాయి.గురువారం విశ్వనాథ్‌పూర్ కాకరవేణి నది నుంచి రెవెన్యూ అధికారులు పలు ట్రాక్టర్లకు ఇసుక పర్మిట్‌లు జారీ చేశారు. కాగా ఉదయం 8 గంటలకే పర్మిట్‌లు దక్కించుకున్న వాహనాలు కాకరవేణి నదిలోకి దూరుతున్నాయి. సాయంత్రం ఆరు దాటినా ఇసుక తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.


ఉదయం 8 గంటలకే విశ్వనాథ్‌పూర్ కాకరవేణి నదిలో ఇసుక ట్రాక్టర్లు